# సాహిత్య విమర్శలో మొదలి

- సిహెచ్. లక్ష్మణచక్రవర్తి

1935లో జన్మించిన మొదలి నాగభూషణశర్మగారు ఆంగ్ల సాహిత్యంలో ఎం.ఎ., నాటక దర్శకత్వంలో ఇల్లినాయ్ విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎఫ్.ఎ., పాశ్చాత్య నాటక సాహిత్యం మీద పిహెచ్.డి. చేశారు. స్వతంత్రంగా 25 నాటకాలు, నాటికలు, 15 పాశ్చాత్య అనుసరణలు,10 సంస్కృత భారతీయ నాటకానువాదాలు చేశారు. 40 సంవత్సరాలు వివిధ విశ్వవిద్యాలయాలలో ఆచార్యులుగా పనిచేశారు. ప్రపంచ ప్రఖ్యాత విజ్ఞానకోశాలైన Oxford Companion to Indian Drama, Cambridge of Plays and performance, Encyclopaedia of Indian Literature వంటి గ్రంథాలలో తెలుగు నాటక, నృత్య, జానపద రీతులను గురించి వ్యాసాలు రచించారు.

1960లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా చేరిన తరువాత వివిధ ప్రాంతాలలో విద్యార్థులతో నాటక ప్రదర్శనలు, ఈ సమయంలో నాటకం మీద చర్చలు, విమర్శలు, ప్రసంగాలు చేశారు. సంగీత నాటక అకాడమీ వారి నాట్యకళలోనూ ఇతర పత్రికలలోనూ నాటక సాహిత్యం మీద వ్యాసాలు రాయడంతో నాటక సాహిత్యంపై విమర్శ రచన ప్రారంభమైంది. ఈ క్రమంలో 1970లో జానపద కళారూపాల మీదికి మళ్ళింది. దీనికనుగుణంగా జానపద నాటక కళారూపాలను పూర్తిగా ఆకళింపు చేసుకుని యక్షగానాలు, తోలుబొమ్మలాటలు, భాగవతాలు మొదలైన వాటిని అధ్యయనం చేస్తూ The Folk performing Arts of Andhra Pradesh అన్న రచన చేశారు. ఇందులో యాభై ఎనిమిది జానపద కళారూపాలను గురించిన విస్తృత సమాచారాన్ని అందించారు.

తెలుగు సాహిత్య పరిశోధనతోనే కాక ఇంగ్లీషు సాహిత్యంలోని అమెరికన్ నాటక రచయిత యూజిన్ ఓనీల్ రచనల మీద పరిశోధన చేసి పిహెచ్.డి. పొందారు. The Shadow puppet Theatre of Andhra Pradesh, Toorpu Bhagavatam వంటి ప్రామాణిక రచనలను జానపద కళారూపాల అధ్యయనంలో భాగంగా వెలువరించారు.

**తెలుగు సాహిత్యం - గాంధీజీ ప్రభావం** అన్న గ్రంథం గాంధీని నాయకునిగా చేసుకుని వచ్చిన, గాంధీ భావనలు ప్రధానంగా గ్రహించి తెలుగులో వచ్చిన సాహిత్యాన్ని గురించి చర్చిస్తుంది. తెలుగులో రాజకీయ సాహిత్యం గాంధీజీతోనే ప్రారంభించి వికసించిందన్న విషయాన్ని ఎరుకపరచడంతో బాటు, ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, ఆంధ్రభారతి వంటి పత్రికలలో వచ్చిన సాహిత్యాన్ని, ఆ సాహిత్యాలపై గాంధీ ప్రభావాన్ని అంచనా వేస్తుంది. పది అధ్యాయాలున్న ఈ పుస్తకంలో సాహిత్యం-జాతీయత, కావ్యసాహిత్యం, శతకాలు, ఖండకావ్యాలు, ఖండికలు, గేయాలు, పాటలు, కీర్తనలు, భజనలు, నాటకం, నవలలు, జీవిత చరిత్రలు, సిద్ధాంత గ్రంథాలలో గాంధీజీ మీద వచ్చిన సాహిత్యాన్ని విశ్లేషించారు. జాతీయోద్యమ ప్రభావంతో గాంధీపై వచ్చిన సాహిత్యాన్ని, ఆయన ప్రభావంతో వచ్చిన సాహిత్యాన్ని అంచనా వేశారు.

**తెలుగు నవలా వికాసం** నవల లక్షణాలను తెలుగు నవల వికాసరీతిని మనముందు నిలుపుతుంది. నవల

స్వరూప స్వభావాలు అన్న మొదటిఅధ్యాయంలో నవలకు 14 సూత్రాలను చెప్పారు. నవలాంగాలను నవలలో ఉండే ముఖ్యమైన అంశాలుగా భావిస్తూ ఇతివృత్త నిర్మాణం, పాత్ర చిత్రణ సంభాషణ, కాలస్థల ఐక్యతలు, శైలి, ఉద్దేశం అన్న ఆరంశాలను చర్చించారు. ఇతివృత్తాన్ని సంఘటనాత్మకం, (Action plot) వ్యక్తి శీలం ప్రధానమైనది (Character plot) భావాత్మకమైనది (Thought plot) అని మూడు రీతులుగా విభజించి మొదటిదానికి చలం నవలలు, వేయిపడగలు రెండవదానికి చంఘీజ్‌ఖాన్, రుద్రమదేవి మూడవదానికి చివరకు మిగిలేది, అల్పజీవి ఉదాహరణలుగా చెప్పారు. తెలుగు నవల యుగవిభజన చేస్తూ తెలుగు నవలావికాసాన్ని ఐదు రీతులుగా భావించారు. (1) ప్రారంభయుగం (2) అనువాదయుగం (3) వికాసయుగం (4) మనోవైజ్ఞానిక యుగం (5) సమకాలీనయుగం అన్నవి. ఈ అధ్యాయం నవలావికాస దృష్టితో రాశారు. తర్వాతి అధ్యాయాలలో సాంఘిక నవలలు, చారిత్రక నవలలు, హాస్యం, అనువాదం అనుకరణలు, మనస్తత్వ నిరూపక నవలలు, జాతీయోద్యమ నవలలు, డిటెక్టివ్ నవలలు అన్న అంశాలను చర్చించారు. కథాకథనశిల్పం అన్న అధ్యాయంలో నవలలోని కథాకథన రీతిని ప్రధానంగా చర్చించారు. ఈ పుస్తకంలో 12 ప్రసిద్ధ నవలలను సమీక్షించారు. కొందరు రచయితలనే ఎన్నుకుని పరిశీలించినా నవలా క్రమపరిణామాన్ని చెప్పడానికి తొలిసారిగా ప్రయత్నం చేసిన మంచిరచనగా తెలుగు నవలావికాసం నిలుస్తుంది.

**నాటక శిల్పం** - ఇది నాటక ప్రక్రియా వివేచన చేసిన పుస్తకం. భారతీయ పాశ్చాత్య నాటక రచనా సంవిధానాల చర్చ, నాటకానికి దగ్గరైన వివిధ ప్రక్రియల విశ్లేషణ, వివిధ నాటక మాధ్యమాల తులనాత్మక పరిశీలన ఇందులో కనిపిస్తుంది. పది అధ్యాయాలున్న ఈ పుస్తకాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు. మొదటి భాగంలోని ఆరు అధ్యాయాలలో నాటక నిర్వచనం, జీవితానికి నాటకానికి పోలిక, నాటక లక్షణాలు, లక్ష్యాలు, ఇతివృత్తం, పాత్రచిత్రణ, భాష ప్రదర్శనాంశాల వివరణను విశ్లేషణాత్మకంగా చర్చించారు. తర్వాతి మూడు అధ్యాయాలలో ప్రాచ్య, పాశ్చాత్య నాటక భేదాలను, నాటకంతో సరిపోయే రేడియో, టెలివిజన్, రంగస్థల నాటకాలను, సినిమా రంగం వంటి వాటిని తులనాత్మకంగా చర్చించారు. చివరి అధ్యాయం పాఠకుడు, ప్రేక్షకుడు విమర్శకుల కొరకు రాసింది. నాటక విశ్లేషణ ఈ మూడు స్థాయిలలో ఉన్నవారు ఎట్లా చేయాలో, నాటక వివేచనలో వీటి పాత్ర ఏమిటో తెలిపారు. అనుబంధంలో నాటక పరిభాష పదసూచి ఈ పుస్తకంలో చేర్చారు. భరతుడు అరిస్టాటిల్ వంటి వారిని, ప్రాచ్య పాశ్చాత్య అభిప్రాయాలను సమన్వయం చేసుకుంటూ 'నాటకశిల్పం' రచన చేశారు. ఈ గ్రంథానికి 2011కు గాను తెలుగు విశ్వవిద్యాలయ విమర్శ అవార్డు లభించింది.

**లోచన** అన్న షష్టిపూర్తి సంచికలో మొదలి నాగభూషణశర్మ రచించిన 12 వ్యాసాలున్నాయి. తెలుగు నాటకరంగాన్ని గురించి, నాటకాల గురించి, నాటకంలో సమయ శిల్పం, మానవుని చిత్రణ వంటి వ్యాసాలతోబాటు బుచ్చిబాబు, ఆత్రేయ, ఆమంచర్ల గోపాలరావు, గిరీష్ కర్నాడ్ వంటి నాటకకర్తలపై విలువైన వ్యాసాలున్నాయి. తొలి వ్యాసంలో ఆధునిక తెలుగు నాటకరంగాన్ని ఐదువిభాగాలుగా విభజించారు. దాని వికాసాన్ని 1880-1900 మొదటి ఔత్సాహిక యుగం, 1900-1928 వృత్తి నాటక యుగం, 1928-1943 కాంట్రాక్టు నాటక యుగం, 1943-1960 రెండవ ఔత్సాహిక నాటక యుగం, 1960-1990 పోటీ నాటక యుగం అని విభజించి ఆయా దశలలో నాటక రంగ స్థితిని సమీక్షించారు. దర్శకత్వం నాడు-నేడు అన్న వ్యాసంలో అరిస్టాటిల్ దర్శకుడి స్థానాన్ని గురించి ఏమీ చెప్పలేదని భరతుడు ఆ పనిని నాట్యశాస్త్రంలో చేశాడని, దర్శకుడికి స్వాభావిక సాంకేతిక

లక్షణాలుంటాయని అందులో సాంకేతిక లక్షణాలకు ప్రాధాన్యమిచ్చాడని భావించారు. వివిధ నాటక రంగాలు ఆధునిక యుగంలో అనుసరించి 'దర్శకత్వం' బాధ్యతలను చర్చించారు. ఆధునిక తెలుగు నాటకరంగం దర్శకత్వంలో ప్రయోగాలు పై వ్యాసానికి కొనసాగింపు. ఇందులో చాట్ల శ్రీరాములు, వి. శ్రీరామమూర్తి, డి.యస్.యన్. మూర్తి వంటివారు చేసిన ప్రయోగాలను పరిశీలించారు. భారతీయ నాటకశాస్త్రం నాటక సమయాలు పేరుతో నాంది, ప్రస్తావన, సంధి, సంధ్యంగాలు, ఇతివృత్త నిర్వహణ వంటి అంశాలను పేర్కొంది. ఆధునిక నాటకంలో ఇతివృత్త నిర్వహణకు తప్ప దేనికీ ప్రాముఖ్యం లేదు. అందువల్ల ఆధునిక నాటకంలో పాటించవలసిన సమయశిల్పాన్ని అంచనా వేస్తూ తెలుగు నాటకంలో సమయశిల్పం వ్యాసం  రాశారు. బుచ్చిబాబు మూడు నాటకాలపై రాసిన వ్యాసంలో శిల్పస్పృహ ఉన్న నాటకకర్తగా అతడ్ని భావించారు. నిగూఢమూ, నైశిత్యమూ, సంక్లిష్టమూ ఈ అన్ని లక్షణాలను కలపోసుకున్న పాత్రచిత్రణవిధానం కన్యాశుల్కంలో ఉందని చెప్పే వ్యాసం కన్యాశుల్కం–పాత్ర వైవిధ్యం. ఆమంచర్ల గోపాలరావు విశ్వంతరపై, ఆత్రేయ నాటకాలపై, గిరీష్ కర్నాడ్ పై విశ్లేషణ వ్యాసాలు 'లోచన'లో ఉన్నాయి. 20వ శతాబ్దిలో పాశ్చాత్య నాటకరంగంలో వచ్చిన వివిధ నాటకోద్యమాలను, అవి మానవుడిని చిత్రించిన తీరును ఆధునిక నాటకాలలో మానవుని చిత్రణ వ్యాసం వివరిస్తుంది. జానపద కళారూపాల పరిణామ విధానం, జానపద నాటక వికాసాలు దేశి రూపకాలను విశ్లేషించే వ్యాసాలు ఇందులో ఉన్నాయి.

నాటకకర్తగా చిలకమర్తి అన్న రచనలో చిలకమర్తి నాటక సంవిధానాన్ని అంచనా వేశారు. ఆత్రేయ, బళ్ళారి రాఘవలపై సురభి నాటక సమాజంపై, స్థానం నరసింహారావు నటజీవన ప్రస్థానం, ధర్మవరం రామకృష్ణమాచార్య జీవితం నాటకరంగం వంటి  విశ్లేషణాత్మక పరిశోధనాత్మక పుస్తకాలు వెలువరించారు. తెలుగు ఇంగ్లీషు భాషలలో మరెన్నో జానపద నాటకాలను గురించి, నాటక సాహిత్యం గురించి విలువైన వ్యాసాలు రచించారు నాగభూషణశర్మ. రెండు సంపుటాలున్న నాటక పదకోశంలో మొదటి సంపుటం పాశ్చాత్య సాంకేతిక పదాలకు జపాన్, చైనా వంటి దేశాల నాటక ప్రక్రియలకు సంబంధించింది కాగా రెండవది కేవలం భారతీయ రంగస్థల శాస్త్ర పదకోశం. భరతుని నాట్యశాస్త్రం, అభినవ గుప్త పాదుల అభినవ భారతి ఇతర ఆలంకారికుల గ్రంథాలలోని తెలుగు ఇంగ్లీషు వివరణలతో కూడినదీ పదకోశం.

కన్యాశుల్కం నూరేళ్ల సమాలోచనం, నూరేళ్ల తెలుగు నాటక రంగం వంటి రచనలకు  పురాణం సూరిశాస్త్రి నాట్యాంబుజం, నాట్యాశోకం వంటి పునర్ముద్రణ రచనలకు సంపాదకుడిగా విలువైన పీఠికలు అందించారు. వారు చేసిన సాహిత్యవిమర్శ ఇంకా అముద్రితంగా ఉండడం తెలుగు సాహిత్యవిమర్శకు లోటు. నాటక సాహిత్య విమర్శలో మొదలి నాగభూషణశర్మగారిది విశ్లేషణాత్మక, పరిశోధనాత్మక, విమర్శనాత్మక మార్గం. నాటక సాహిత్య పరిణామం, నాటక ప్రక్రియలో భారతీయ, విదేశీయ, జానపద మార్గాలు, ప్రాచ్య, పాశ్చాత్య నాటకాల పరస్పర వినిమయం, ప్రభావాలను, నటుల, నాటకకర్తల ప్రత్యేకతను తెలుగు సాహిత్యవిమర్శ అందించిన వారు మొదలి నాగభూషణ శర్మ.  నాటక సాహిత్యవిమర్శ నాటకసాహిత్యం, జానపద కళారూపాలు, జానపద నాటకాలతో బాటు ప్రయోక్త, ప్రయోగం, ప్రదర్శన, నాటకశిల్పం, నాటక పరిణామాలపై విశ్లేషణాత్మకమైన రీతిలో అకడమిక్ పద్ధతిలో రచనలు చేసిన నాటక సాహిత్యవిమర్శకులు మొదలి నాగభూషణశర్మ.